PRGI No. APTEL/2010/31893

# కొత్త స్వరం

తెలుగు దిన పత్రిక

గురువారం, జూన్ 11, 2026

TG & AP

సంపుటి : 16 (Vallume : 16) | సంచిక : 7 (Issue: 7) | పేజీలు : 4 (Pages : 4) | వెల : రూ 2.00/- (Rs : 2.00/-)



## ప్రధాని మోదీని కలిసి అభినందించిన సీఎం చంద్రబాబు

**ఢిల్లీలో ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో సీఎం పాల్గొనడం**

**సమావేశానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేక భేటీ**

**ప్రధానిగా 12 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానానికి శుభాకాంక్షలు**

**దేశ అభివృద్ధికి మోదీ నాయకత్వం కీలకమని అభినందన**

**జాతీయ రాజకీయ పరిణామాలపై సమావేశంలో చర్చ**

**ఢిల్లీ, జూన్ 10 (కొత్త స్వరం):** ఢిల్లీలో నిర్వహించిన ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని ప్రధాని మోదీను ప్రత్యేకంగా కలిసి అభినందించారు. ప్రధానిగా రికార్డు స్థాయిలో 12 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలు, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం జరిగిన ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో జాతీయ రాజకీయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మిత్రపక్షాల సమన్వయంపై చర్చ జరిగినట్లు తెలిసింది.



## దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత

**తమిళ చిత్రపరిశ్రమలో విషాదం**

**గ్రామీణ కథలకు వెండితెరపై కొత్త దిశ చూపిన మహానుభావుడు**

**'16 వయతినిలే'తో సంచలన ఆరంభం**

**నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి విశిష్ట సేవలు**

**రాష్ట్ర లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్న తమిళనాడు ప్రభుత్వం**

2

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి..

**మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం**

**వీపనగండ్ల యువత అభ్యర్థనకు స్పందించిన మంత్రి జూపల్లి**

**మినీ స్టేడియం నిర్మాణానికి నాలుగు ఎకరాల భూమి బదిలీ**

**రూ.1.50 కోట్లకు పైగా విలువైన స్థలాన్ని ప్రభుత్వానికి అందజేత**

**డిజిటల్ సంతకాలతో పూర్తయిన భూ బదిలీ ప్రక్రియ**

**గ్రామీణ క్రీడాకారులకు కొత్త అవకాశాలు కల్పించే నిర్ణయం**



**నాగర్‌కర్నూల్, జూన్ 10 (కొత్త స్వరం):** రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నాయకులు అరుదుగా కనిపించే ఈ కాలంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తన మాటను నిలబెట్టుకుని ఆదర్శంగా నిలిచారు. వీపనగండ్ల మండలంలో మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని విరాళంగా అందజేస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటన సందర్భంగా స్థానిక యువత, క్రీడాకారులు తమ ప్రాంతంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లిని కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన ఆయన, స్టేడియం నిర్మాణానికి అవసరమైన భూమిని తానే అందజేస్తానని హామీ ఇచ్చారు. తాజాగా ఆ మాటను నిలబెట్టుకుంటూ వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 532/ఆలో తన పేరిట ఉన్న నాలుగు ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వానికి బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి అందజేసిన నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ భూ బదిలీ ప్రక్రియకు కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ సాక్షులుగా డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి జూపల్లి తీసుకున్న ఈ నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, అవకాశాలు లభించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## సుపరిపాలనకు ప్రజాసేవే అతిపెద్ద పరీక్ష

- ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోదీ సందేశం
- ఎక్స్ వేదికగా ప్రజాసేవపై ఆసక్తికర వ్యాఖ్యలు
- వినయం, అంకితభావమే ప్రజల విశ్వాసానికి పునాది అన్న ప్రధాని
- సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా మోదీ రికార్డు
- దేశవ్యాప్తంగా శుభాకాంక్షల వెల్లువ

2



## భారతీరాజాకు సీఎం విజయ్ నివాళి

### భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ప్రభుత్వ నిర్ణయం**

**తమిళ సినీ రంగానికి భారతీరాజా సేవలు చిరస్మరణీయం**

**నిర్మాతల సంఘం విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం**

**భారతీయ సినిమాకు అసమాన సేవలందించిన దర్శక దిగ్గజం**

**చెన్నై, జూన్ 10 (కొత్త స్వరం):** దిగ్గజ సినీ దర్శకుడు భారతీరాజాకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం నివాళులర్పించారు. భారతీరాజా నివాసానికి వెళ్లిన సీఎం ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ (మిగతా 2లో..)



## ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

**రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం**

**గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల**

**సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం**

**రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ**

5



## భారతీరాజా గొప్ప సృష్టికర్త

**దర్శక దిగ్గజం మృతిపై రామ్‌గోపాల్ వర్మ సంతాపం**

**భారతీయ సినిమాకు కొత్త దిశ చూపిన మహోన్నత వ్యక్తి**

**యదార్థవాదం, భావోద్వేగాలను అద్భుతంగా మేళవించిన దర్శకుడు**

**భాషలకు అతీతంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న సినీ మేధావి**

**ఎక్స్ వేదికగా భావోద్వేగ నివాళి అర్పించిన వర్మ**

2

# ఫ్యూచర్ సిటీకి తొలి అడుగు..

## కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

**తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్ స్థాయిలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి**

**అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శ**

**చెరువుల పునరుద్ధరణతో 'లేక్ ఎకానమీ'కి ఊతమిస్తామన్న సీఎం**

**అంతర్జాతీయ పెట్టుబడుల కోసం డిసెంబరులో గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ**



**హైదరాబాద్, జూన్ 10 (కొత్త స్వరం):** తెలంగాణను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వాస్తవరూపం దాల్చుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేవలం 150 రోజుల రికార్డు సమయంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, పనితీరుకు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. రాబోయే ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి అంతర్జాతీయ నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీపై సీఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తిరస్కరించిన పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే రాజకీయంగా మరింత బలహీనపడుతుందని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో రహదారులు జలమయం కావడాన్ని ప్రస్తావిస్తూ, చెరువులు మరియు నీటి వనరుల ఆక్రమణలే ఇందుకు ప్రధాన కారణమని సీఎం అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భూకబ్జాలను తొలగించి, చెరువులను పునరుద్ధరించడం ద్వారా 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ఏడాది డిసెంబరులో మరో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని నిరంతరం విస్తరించడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు బంగారం ధరను మించిపోయాయని వ్యాఖ్యానించారు. ఆనాటి నిజాం పాలకులు, కులీ కుతుబ్‌షాహీలు హైదరాబాద్ నగరాన్ని





పలు దఫాలుగా విస్తరించారని గుర్తు చేసిన సీఎం, ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదే ధోరణి కొనసాగితే రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని విమర్శించారు.

# భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం: జగన్











**రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యమే కారణమని వ్యాఖ్య**

**బాధిత కుటుంబాలను పరామర్శించిన వైఎస్ జగన్**

**కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం అని ఆరోపణ**

**బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్**

**స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని సూచన**

**విశాఖపట్టణం, జూన్ 10 (కొత్త స్వరం):**
విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదానికి రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాలను సక్రమంగా పాటించక పోవడమే ప్రధాన కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం విశాఖపట్టణాన్ని సందర్శించిన ఆయన ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, లిక్విడ్ స్టీల్ బ్లాస్ట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో స్పందించాలని సూచించారు. 14 నెలల క్రితం స్టీల్ ప్లాంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మాస్టర్ టెక్నీషియన్ పెంటయ్య కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని ఆరోపించారు. పరిహారం గురించి అడిగితే ఫైలు పోయిందని అధికారులు సమాధానం ఇవ్వడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తక్షణమే ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి రెండు లేఖలు కూడా రాశామని తెలిపారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల ప్రయోజనాల కోసం నిలబడింది వైసీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. విశాఖలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీని కూడా ఈ అంశంపై కోరినట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌లో గత రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని జగన్ ఆరోపించారు. ఒకప్పుడు 28 వేల మంది ఉద్యోగులు ఉండగా ప్రస్తుతం సుమారు 10,500 మందిని తగ్గించారని తెలిపారు. దీంతో మిగిలిన రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులపై పనిభారం పెరిగిందని అన్నారు. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని కూటమి ప్రభుత్వం చెబుతోందని, అయితే ఆ నిధులను స్వచ్ఛంద పదవీ విరమణ పథకం, బ్యాంకు రుణాల చెల్లింపులకే వినియోగించారని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణ, భద్రతా చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం అందించిందని గుర్తుచేసిన జగన్, అదే విధంగా స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సూచించారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలు కొంత ఓపిక పట్టాలని, ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కోటి రూపాయల పరిహారం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి వెళ్లి మరికొందరు బాధితులను పరామర్శించారు.

# మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం

**దేశానికే అంకితమైన జీవితం ప్రధాని మోదీదే: పవన్ కల్యాణ్**

**4,399 రోజుల ప్రజాసేవ పూర్తి చేసుకున్న ప్రధానికి అభినందనలు**

**మోదీ నాయకత్వంలో భారత్ బలమైన దేశంగా ఎదిగిందన్న ఉప ముఖ్యమంత్రి**

**డిజిటల్ ఇండియా నుంచి మౌలిక వసతుల వరకు విప్లవాత్మక మార్పులు**

**వికసిత భారత్-2047లో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామి**

**అమరావతి, జూన్ 10 (కొత్త స్వరం):**
ప్రధాని నరేంద్ర మోదీ దేశ సేవలో 4,399 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందించిన పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సేవలను ప్రశంసిస్తూ ప్రత్యేక సందేశాన్ని పోస్టు చేశారు. "మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం" అంటూ మోదీ నాయకత్వాన్ని కొనియాడిన పవన్, దేశానికి నిస్వార్థ సేవ చేస్తున్న ప్రధానమంత్రి మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ బలమైన దేశంగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు. దేశ భద్రత మరింత పటిష్ఠమైందని, భారత సాయుధ దళాలు ఆధునికీకరణ దిశగా కొత్త శక్తిని సంతరించుకున్నాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక స్థానాన్ని సంపాదించిందని, జీ-20 సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నారు. గ్లోబల్ సౌత్‌కు బలమైన స్వరంగా భారత్ ఎదిగిందని వ్యాఖ్యానించారు. డిజిటల్ ఇండియా విప్లవం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని, జనధన్–ఆధార్–మొబైల్ అనుసంధానంతో పారదర్శక పాలన సాధ్యమైందని పేర్కొన్నారు. యూపీఐ, డీబీటీ వ్యవస్థల ద్వారా డిజిటల్ లావాదేవీలు వేగంగా విస్తరించాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది మందికి వైద్య భరోసా లభిస్తోందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సౌకర్యాలు అందుతున్నాయని వెల్లడించారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిలో గణనీయ పురోగతి సాధించారని, వందే భారత్ రైళ్లతో రవాణా రంగంలో కొత్త శకం ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని పవన్ కల్యాణ్ అన్నారు. 'స్వర్ణాంధ్ర–2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 'వికసిత భారత్–2047' సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భిన్నత్వమే భారతదేశ బలమని, అన్ని భాషలు దేశ గర్వకారణమని పేర్కొన్న పవన్ కల్యాణ్, జాతీయ సమైక్యత, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. విభజన శక్తులను ధీటుగా ఎదుర్కొంటామని పేర్కొంటూ "జై హింద్.. జై భారత్" అంటూ తన సందేశాన్ని ముగించారు.

# దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత

**తమిళ చిత్రపరిశ్రమలో విషాదం**

**గ్రామీణ కథలకు వెండితెరపై కొత్త దిశ చూపిన మహానుభావుడు**

**'16 వయతినిలే'తో సంచలన ఆరంభం**

**నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి విశిష్ట సేవలు**

**రాష్ట్ర లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్న తమిళనాడు ప్రభుత్వం**

**చెన్నై, జూన్ 10 (కొత్తస్వరం)**
తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతిª`లలై, ముదల్ మరియాదై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

# భారతీరాజాకు సీఎం విజయ్ నివాళి

(మొదటి పేజీ తరువాయి..)

అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ ప్రకటించారు. తమిళ సినీ రంగానికి ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అంతకుముందు తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ వ్యవస్థాపకుడు, ప్రముఖ దర్శకుడు భారతీరాజాకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రిని కోరింది. ఈ విజ్ఞప్తికి స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో అంత్యక్రియలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో భారతీరాజాను భారతీయ చలనచిత్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తిగా ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ కొనియాడింది. 2004లో కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసిన పద్మశ్రీ పురస్కారంతో పాటు ఆరు జాతీయ చలనచిత్ర అవార్డులు, ఆరు తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు సహా అనేక గౌరవాలు అందుకున్నారని గుర్తు చేసింది. దర్శకుడిగా ఎన్నో కాలాతీత చిత్రాలను తెరకెక్కించడమే కాకుండా, నటుడిగా కూడా తనదైన ముద్ర వేసి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారని పేర్కొంది. భారతీయ సినిమాకు ఆయన అందించిన సేవలు అసమానమని అభివర్ణించింది. 2020లో పలువురు నిర్మాతలతో కలిసి భారతీరాజా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌ను స్థాపించారని, ఆయన నాయకత్వంలో సంస్థ స్థిరంగా అభివృద్ధి చెంది ప్రస్తుతం 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలకు ప్రాతినిధ్యం వహిస్తోందని వెల్లడించింది. నిర్మాతలు, దర్శకులు, నటుల సంక్షేమంతో పాటు తమిళ సినిమా సమగ్రాభివృద్ధి కోసం భారతీరాజా ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేశారని, అసోసియేషన్ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ఆయన నిరంతర మద్దతు అందించారని ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తన ప్రకటనలో కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

# భారతీరాజా గొప్ప సృష్టికర్త

**దర్శక దిగ్గజం మృతిపై రామ్‌గోపాల్ వర్మ సంతాపం**

**భారతీయ సినిమాకు కొత్త దిశ చూపిన మహోన్నత వ్యక్తి**

**యదార్థవాదం, భావోద్వేగాలను అద్భుతంగా మేళవించిన దర్శకుడు**

**భాషలకు అతీతంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న సినీ మేధావి**

**ఎక్స్ వేదికగా భావోద్వేగ నివాళి అర్పించిన వర్మ**

**అమరావతి, జూన్ 10 (కొత్త స్వరం):**
ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, లెజెండరీ దర్శకుడు భారతీరాజా మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆయన భావోద్వేగ పోస్టు చేస్తూ భారతీరాజాకు నివాళులర్పించారు. భారతీరాజా కేవలం ఒక దర్శకుడు మాత్రమే కాదని, భారతీయ సినిమాను కొత్త కోణంలో ఆవిష్కరించిన గొప్ప సృష్టికర్త అని వర్మ పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమపై ఆయన చూపిన ప్రభావం చిరస్మరణీయమని అన్నారు. భారతీయ చలనచిత్ర రంగానికి శ్రీదేవి వంటి దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన మహిళా సూపర్‌స్టార్‌ను అందించడమే కాకుండా, సత్యజిత్ రే తరహా యదార్థవాదాన్ని, హృషికేశ్ ముఖర్జీ శైలిలో పాత్రల రూపకల్పనను, బసు ఛటర్జీ ప్రత్యేకతైన సందర్భానుసార హాస్యాన్ని భారతీరాజా తన చిత్రాల్లో అద్భుతంగా మేళవించారని కొనియాడారు. నేలవిడవని సంప్రదాయాలు, గ్రామీణ జీవన విధానం, మానవ సంబంధాలను ప్రతిబింబించే కథల ద్వారా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆయన ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. భాషలతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న భారతీరాజా నిజమైన సృజనాత్మక శక్తి అని రామ్ గోపాల్ వర్మ తన పోస్టులో పేర్కొన్నారు. భారతీరాజా మృతి భారతీయ సినీ రంగానికి తీరని లోటని, ఆయన చిత్రాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# సుపరిపాలనకు ప్రజాసేవే అతిపెద్ద పరీక్ష

**న్యూఢిల్లీ, జూన్ 10 (కొత్త స్వరం):**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పాలనలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్ వేదికగా ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. ప్రజాసేవ, సుపరిపాలన, నాయకత్వ బాధ్యతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా మోదీ తన పోస్టులో, "ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు" అని పేర్కొన్నారు. భారత్‌లో అత్యంత సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా మోదీ కొత్త రికార్డు సృష్టించిన నేపథ్యంలో ఈ సందేశం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశాభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా సంస్కరణల దిశగా తన ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పరోక్షంగా వెల్లడించారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ రాజకీయ, సామాజిక, వ్యాపార, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు మోదీకి శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో దేశం సాధించిన పురోగతిని పలువురు ప్రశంసిస్తున్నారు. మోదీ సందేశం సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీస్తుండగా, ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధతను ప్రతిబింబించే వ్యాఖ్యగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

# స్టీల్‌ప్లాంట్ పదం పలికే అర్హత కూడా జగన్‌కు లేదు: మంత్రి అనిత

**ఐదేళ్ల పాలనలో స్టీల్‌ప్లాంట్‌ను ఏనాడూ సందర్శించలేదని విమర్శ**

**ప్రమాద ఘటనలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న హోంమంత్రి**

**మృతుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు అందిస్తున్నామని వెల్లడి**

**పాయకరావుపేట అభివృద్ధికి రూ.1,150 కోట్లతో పనులు చేపట్టినట్లు ప్రకటన**

**పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**


**అనకాపల్లి, జూన్ 10 (కొత్త స్వరం):**
విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాద ఘటనపై వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా ఖండించారు. స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికే అర్హత కూడా జగన్‌కు లేదని ఆమె విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మంత్రి అనిత, ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో జగన్ ఎప్పుడైనా స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారా? అక్కడి కార్మికుల సమస్యల గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శించడానికి ఆస్పత్రికి వచ్చినప్పటికీ, ఆయన పార్టీ కార్యకర్తలు రాజకీయ నినాదాలు చేయడం బాధాకరమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిహారం అందజేస్తున్నామని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి కంటే ఎక్కువ మొత్తంలో పరిహారం అందుతుందని పేర్కొన్నారు. అలాగే మరణించిన ఒప్పంద కార్మికుల కుటుంబాలకు కూడా పరిహారంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని, బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత వ్యాఖ్యానించారు. అనంతరం పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ, జగన్ పాలనలో ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. పాయకరావుపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5.46 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అనిత వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలో సుమారు రూ.1,150 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. నాలుగు మండలాల పరిధిలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 871 పనులకు రూ.118 కోట్లు మంజూరయ్యాయని, గ్రామీణ ప్రాంతాల్లో 172 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో 36 పనుల ద్వారా 137 కిలోమీటర్ల రహదారులను రూ.130 కోట్లతో అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.66 కోట్లతో 244 పనులు చేపట్టామని హోంమంత్రి అనిత తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# భారతీరాజా మృతి తీరని లోటు

**ఆయన దర్శకత్వంలో నటించడం గొప్ప అనుభూతి**

**నివాళి అర్పించిన మెగాస్టార్ చిరంజీవి**

**హైదరాబాద్, జూన్ 10 (కొత్తస్వరం)**
విలక్షణ కథాంశాలతో యావత్ దేశాన్ని మెప్పించిన ఈ 'దర్శక శిఖరం' భారతీరాజా మరణవార్తతో అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించేందుకు సినీ ప్రముఖులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ విషాద సమయంలో మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ అత్యంత ఎమోషనల్ అయ్యారు. భారతీయ చలనచిత్ర రంగం ఇవాళ ఒక అసాధారణ కథకుడిని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెటూరి మట్టి పరిమళాలను, అచ్చమైన మానవ సంబంధాల సున్నితత్వాన్ని, అమాయకత్వంతో కూడిన ప్రేమను, సామాన్యుల జీవితాల్లోని భావోద్వేగాలను వెండితెరపై అద్భుతమైన కావ్యాలుగా మలిచిన ఘనత భారతీరాజా గారికే దక్కుతుందని చిరంజీవి కొనియాడారు. ఆయన సృష్టించిన చిత్రాలు కేవలం ప్రేక్షకులను అలరించడమే కాకుండా, రాబోయే ఎన్నో తరాల యువ దర్శకులకు దిక్సూచిలా, స్ఫూర్తిప్రదాతగా నిలిచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1987లో భారతీరాజా గారి దర్శకత్వంలో వచ్చిన క్లాసిక్ ఎమోషనల్ డ్రామా 'ఆరాధన' చిత్రంలో తామిద్దరం కలిసి పనిచేసిన మధుర జ్ఞాపకాలను చిరంజీవి ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఆ సినిమాలో తాను పోషించిన 'పులి రాజు' అనే వైవిధ్యమైన పాత్ర తన కెరీర్‌లో ఎప్పటికీ ప్రత్యేకమని, అటువంటి గొప్ప పాత్రను తనతో చేయించిన అదృష్టం ఆ దర్శకేంద్రుడి వల్లే దక్కిందని చెప్పారు. షూటింగ్ సమయంలో సినిమా పట్ల భారతీరాజా గారికి ఉన్న ప్యాషన్, ఆయన చూపించిన అంకితభావం, అంత పెద్ద దర్శకుడైనా ఆయనలో ఉన్న నిరాడంబరత్వం తన మనసుపై ఎనలేని ముద్ర వేశాయని మెగాస్టార్ గుర్తుచేసుకున్నారు.





భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయన భౌతికంగా మనల్ని విడిచివెళ్లినా ఆయన చిత్రాల ద్వారా ఎప్పటికీ చిరస్మరణీయంగానే ఉంటారని పేర్కొంటూ, శోకతప్త కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



**నందికొట్కూరు, జూన్ 10 (కొత్త స్వరం):**
ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సంపంగి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో కూలీల సమస్యలను తెలుసుకున్న ఆయన, నాలుగు వారాలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు, పనిముట్లు కల్పించడంతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా చార్జీలు చెల్లించాలని కోరారు. ఉపాధి మేటులకు పారితోషికం పెంచి, అవసరమైన సామగ్రి అందించాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కూలీలు పాల్గొన్నారు.

# మోదీ దీర్ఘాయుష్షుకు ప్రత్యేక పూజలు





### దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు
### ఆదోని మంగరాయ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహణ
### ప్రధాని మోదీ సేవలను కొనియాడిన ఎమ్మెల్యే పార్థసారథి
### రాష్ట్ర బీజేపీ బలోపేతానికి పీవీఎన్ మాధవ్‌కు శక్తి ప్రసాదించాలని ఆకాంక్ష
### వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా ప్రత్యేక పూజలు

**ఆదోని, జూన్ 10 (కొత్త స్వరం) :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదవీకాలం 12 సంవత్సరాలు పూర్తిచేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో పాటు దేశాభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి తెలిపారు. బుధవారం ఆదోని పట్టణంలోని శ్రీ శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతరం దేశానికి ప్రధానమంత్రులుగా పనిచేసిన వారందరిలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన నాయకుడిగా నరేంద్ర మోదీ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. భారతదేశం ఆర్థిక, సామాజిక, రాజకీయ, వ్యవసాయ, వాణిజ్య, సైనిక, అంతరిక్ష రంగాల్లో మరింత పురోగతి సాధించి ప్రపంచంలో అగ్రశ్రేణి దేశంగా ఎదగాలని, అందుకు ప్రధాని మోదీకి మరింత శక్తి, ఆరోగ్యం ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆయురారోగ్యాలు కల్పించి, రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసే శక్తిని ప్రసాదించాలని కోరినట్లు చెప్పారు. దేవస్థానానికి చేరుకున్న ఎమ్మెల్యేకు విచారణకర్త నఖాతే శ్యాంప్రసాద్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నఖాతే శ్రీధర్, ఆలయ మేనేజర్ భీమాచార్, ప్రధానార్చకులు గురాచార్, వేదపండితులు నెరణికి దత్తాత్రేయ శాస్త్రి, గరుడాద్రి రమేష్, వేణుగోపాల్ శర్మ, గరుడాద్రి కార్తీక్ శర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గునిగిరి నీలకంఠ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, నియోజకవర్గ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, వెల్లాల మధుసూదన శర్మ, మండల అధ్యక్షులు వేణుగోపాల్, ఉషారాజు, మహబూబ్ బాషా, ఆర్. నాగార్జున, దేశాయ్ గిరి, దేశాయ్ రవీంద్ర, దేశాయ్ చక్రవర్తి, నాగేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలి

**రైతు, కౌలు రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్**

**వ్యవసాయ అధికారులకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ వినతిపత్రం**

**ఎరువుల ధరలు తగ్గించి అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి**

**కౌలు రైతులకు ఆధార్ ఆధారంగా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని సూచన**

**రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరిన నాయకులు**



**నందికొట్కూరు, జూన్ 10 (కొత్త స్వరం):**
2026 ఖరీఫ్ సీజన్‌లో రైతులు, కౌలు రైతులకు మొక్కజొన్న, వరి, మినుము, పెసర, కంది, సోయాబీన్, జీలుగ తదితర పంటల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరులో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ, అఖిల భారత కిసాన్ మహాసభ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నందికొట్కూరు ఏడీఏ గిరీష్, నందికొట్కూరు మండల వ్యవసాయ అధికారి షేక్ షావలి, పగిడ్యాల మండల వ్యవసాయ అధికారి మురళీధర్‌లకు ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ గిరీష్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, రైతులు, కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనికి స్పందించిన పిక్కిలి వెంకటేశ్వర్లు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారని తెలిపారు. మొక్కజొన్న, పత్తి, వరి, సోయాబీన్, మినుము, పెసర, ఉల్లి, మిరప, కంది, జీలుగ తదితర పంటల విత్తనాలను 50 శాతం రాయితీపై ఏపీ సీడ్స్, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా రైతులకు అందించాలని కోరారు. ఎరువుల ధరలను తగ్గించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ అయ్యేంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టి, ప్రతి రైతుకు విత్తనాల కొనుగోలు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో పంటతో సంబంధం లేకుండా బ్యాంకుల ద్వారా ఎకరాకు రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు అందించాలని, గత ఏడాది గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయినందున రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు టి. నరసింహులు, వేల్పుల ఏసన్న, రైతు సంఘం జిల్లా నాయకులు బి. కృష్ణయ్య, వడ్డే శ్రీరాములు, షేక్ మహమ్మద్ బాషా, ఏబీఎన్ పాలెం సుధాకర్, భాస్కర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## వేల్పనూరు బాలుర వసతి గృహంలో విద్యార్థులను చేర్పించండి


**రెండో రోజు విస్తృత ప్రచారం నిర్వహించిన జీవీఎంసీ సభ్యుడు లింగాల నాగరాజు**



**వెలుగోడు, జూన్ 10 (కొత్త స్వరం):**
వేల్పనూరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులను చేర్పించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు పిలుపునిచ్చారు. విద్యార్థుల చేరికల కోసం నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా పాములపాడు మండలంలోని పాములపాడు, రుద్రవరం, ఆనందపురం గ్రామాల్లో రెండో రోజు విస్తృతంగా పర్యటించిన ఆయన తల్లిదండ్రులతో సమావేశమై వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన బెడ్‌షీట్లు, కార్పెట్లు, ట్రంకు పెట్టెలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ప్రతి నెల విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు కూడా అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేసేందుకు ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అదనపు ట్యూషన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వసతి గృహంలో పచ్చని వాతావరణం, విశాలమైన గదులు, పరిశుభ్రమైన పరిసరాలు, నాణ్యమైన భోజనం, తాగునీటి సదుపాయం సహా అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనుభవజ్ఞులైన సంక్షేమ అధికారుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను వేల్పనూరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో చేర్పించి మెరుగైన విద్యా అవకాశాలను కల్పించాలని లింగాల నాగరాజు కోరారు.

## పెరమాల ప్రదీప్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు సీపీఎం నాయకుల వినతి**



**పగిడ్యాల, జూన్ 10 (కొత్త స్వరం):**
ఉపాధి హామీ పనులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన పెరమాల ప్రదీప్ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన "మీ భూమి – మీ హక్కు" కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గిత్త జయసూర్యను సీపీఎం మండల కార్యదర్శి పి. పకీర్ సాహెబ్, సీఐటీయూ జిల్లా నాయకుడు టి. గోపాలకృష్ణ, కేవీపీఎస్ జిల్లా నాయకురాలు గంధం హుస్సేన్ అమ్మ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి ఎస్సీ కాలనీకి చెందిన పెరమాల ప్రదీప్ ఉపాధి హామీ పనులకు వెళ్లడంతో పాటు భరత్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. మే 26న ఉపాధి హామీ పనికి వెళ్లిన సమయంలో గుండెపోటుతో కుప్పకూలిపోవడంతో తోటి కూలీలు అతడిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని పేర్కొన్నారు. మృతుడు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కూడిన కుటుంబానికి ఏకైక ఆధారంగా ఉన్నాడని, ఆయన మరణంతో కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించి 15 రోజులు గడిచినా ప్రభుత్వ అధికారులు ఇప్పటివరకు ఆ కుటుంబాన్ని పట్టించుకోలేదని, కనీసం అంత్యక్రియల ఖర్చుల కోసం కూడా ఎలాంటి సహాయం అందలేదని విమర్శించారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు పిల్లలకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని కోరారు. ప్రభుత్వ పరంగా లభించే అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య స్పందిస్తూ పెరమాల ప్రదీప్ కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం ద్వారా లభించే సహాయాన్ని అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు పీఆర్టీయూ వినతి



**పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్**

**సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని విజ్ఞప్తి**

**ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులు భర్తీ చేయాలని సూచన**

**ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ప్రతిపాదన**

**ఉపాధ్యాయ సర్దుబాట్లు, పదోన్నతులపై కీలక సూచనలు**

**నంద్యాల, జూన్ 10 (కొత్త స్వరం) :**
ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఆర్టీయూ నంద్యాల జిల్లా శాఖ నాయకులు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియాను కోరారు. ఈ మేరకు బుధవారం నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై. రాంపక్కి రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి, ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, మెమో-57 అమలుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏల్లో కనీసం రెండు విడతలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ నగదు, ఏపీజీఎల్ఐసీ క్లెయిమ్‌లను విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల కోసం ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించాలని, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డైట్, ఐఏఎస్ఈ, ఎస్సీఈఆర్టీ లెక్చరర్ వంటి పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. అలాగే ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ యాక్ట్-2025 రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఉపాధ్యాయుల క్యాడర్ ఆర్గనైజేషన్ చేపట్టాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఐదేళ్లకు పైగా సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అయినందున, 2011కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 21(2)లో సవరణ చేయాలని కోరారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ఆఫ్‌లైన్ విధానంలో ప్రత్యేక టెట్ నిర్వహించి, అర్హత మార్కులను 35 శాతంగా నిర్ణయించాలని సూచించారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య శాఖలను విలీనం చేసి ఒకే విద్యాశాఖగా నిర్వహించాలని, జీవో నం.223ను రద్దు చేసి జీవో నం.302ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 40 శాతం జేఎల్ కోటా పదోన్నతులను స్కూల్ అసిస్టెంట్లకు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాట్ల విషయంలో జూన్ 30 నాటికి విద్యార్థుల నమోదును ప్రామాణికంగా తీసుకోవాలని, 2025 బదిలీల్లో బదిలీ అయినప్పటికీ ఇంకా రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సర్దుబాట్లు చేపట్టరాదని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సీఆర్టీల సేవలను పునరుద్ధరించాలని కోరారు. అలాగే మెడికల్ బిల్లుల మంజూరు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కు చెందిన వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


**పాత్రికేయులు కావలెను**
కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం
నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు
కొత్తస్వరం 9492813364

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
కర్నూలు - నంద్యాల
గురువారం, జూన్ 11, 2026


# ప్రత్యేక ఓటరు సవరణపై పాణ్యం స్థాయి అవగాహన సమావేశం

**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**

కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై పాణ్యం నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశం పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు ఓర్వకల్లు, కల్లూరు, పాణ్యం, గడివేముల మండలాలు, కల్లూరు అర్బన్ 16 వార్డులకు చెందిన బూత్ ఇన్‌చార్జులు, గ్రామ నాయకులు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి, పాణ్యం యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి, ఎస్ఐఆర్ పాణ్యం నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**జిల్లా పోలీసు కార్యాలయంలో ఈగల్ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**"డ్రగ్స్ వద్దు బ్రో" బ్రోచర్లు, వాల్ పోస్టర్ల ఆవిష్కరణ**

**మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన**

**డ్రగ్స్ సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచన**





**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో ఈగల్ టీం ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "డ్రగ్స్ వద్దు బ్రో" పేరుతో రూపొందించిన అవగాహన బ్రోచర్లు, వాల్ పోస్టర్లను సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి యోగా, యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, డ్రగ్స్ అలవాటు వ్యక్తి, కుటుంబం, సమాజ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అవసరమని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని సూచించారు. అలాగే ఎన్‌డీపీఎస్ చట్టం–1985పై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించి, ఈగల్ విభాగం చేపడుతున్న వివిధ అవగాహన, నిరోధక చర్యల గురించి వివరించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కర్నూలు పోలీసులు, ఈగల్ టీం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలీషా, కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.









# ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్వాగతం

**ఢిల్లీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ**

**రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కృషి ప్రశంసనీయం**

**చంద్రబాబు నాయకత్వం స్ఫూర్తిదాయకమన్న బైరెడ్డి శబరి**

**ప్రజా సంక్షేమం, రాష్ట్ర పురోగతికి సీఎం నిరంతర కృషి**

**ఢిల్లీలో ఆత్మీయంగా స్వాగతం పలికిన నంద్యాల ఎంపీ**



**న్యూఢిల్లీ, జూన్ 10 (కొత్త స్వరం):**

ఢిల్లీ పర్యటనకు బుధవారం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ సమగ్ర పురోగతి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడంలో ఆయన నాయకత్వం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చేపడుతున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

# జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభం

**జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం**

**ఉమ్మడి జిల్లాల అభివృద్ధి అంశాలపై సమీక్ష**

**వ్యవసాయం, నీటిసరఫరా, విద్యుత్, విద్యాశాఖలపై చర్చ**

**సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు**

**వివిధ శాఖల పనితీరుపై అధికారుల సమీక్ష**




**కర్నూలు/నంద్యాల, జూన్ 10 (కొత్త స్వరం):**

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి వాల్మీకి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఉభయ జిల్లాలకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, విద్యుత్ శాఖ, విద్యాశాఖతో పాటు పలు కీలక శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు వెల్లడిస్తూ చేపట్టిన పనులను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

# రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్ కట్టుదిట్టం





**నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు**

**అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై విస్తృత తనిఖీలు**

**రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం**

**డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నిర్వహణ**

**ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి**

**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రి వేళల్లో 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీల లక్ష్యంతో కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కర్నూలు నగరంలో పీసీఆర్ సీఐ శివశంకర్, ఆర్ఐ పోతలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లూ కోల్ట్స్ బృందాలు, క్యూఆర్టీ పోలీసు బృందాలు పాల్గొని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. అనుమానితుల వేలిముద్రలను సేకరించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. రాత్రివేళల్లో ప్రయాణించే వాహనదారులు అలసటకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–112 లేదా డయల్–100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
https://kothaswaram.com



# బీఆర్ఎస్ నేత కేటీఆర్ సంతాపం





**హైదరాబాద్, జూన్ 10 (కొత్త స్వరం):**
ప్రముఖ తమిళ దర్శకుడు భారతీరాజా మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఎంతో కలచివేసిందని పేర్కొంటూ ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ భారతీయ సినిమాను వినూత్న మార్గంలో నడిపించిన మహోన్నత కళాకారుడు భారతీరాజా అని కొనియాడారు. గ్రామీణ జీవితాన్ని, మానవ సంబంధాలను వెండితెరపై సహజత్వంతో ఆవిష్కరించి ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. భారతీరాజా రూపొందించిన చిత్రాలు తరతరాల పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతాయని, ఆయన సృజనాత్మకత భారతీయ సినీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారతీరాజా మరణం తమిళ సినీ పరిశ్రమకే కాకుండా యావత్ భారతీయ సినిమా రంగానికి తీరని లోటని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబ సభ్యులకు, సినీ పరిశ్రమకు చెందిన సహచరులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భారతీరాజా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన సేవలను సినీ ప్రపంచం ఎప్పటికీ మరువలేదని కేటీఆర్ పేర్కొన్నారు.

## బషీరాబాద్ గ్రామ కార్యదర్శిగా బాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

**సంగెం కాలన్ గ్రామపంచాయతీ నుంచి బదిలీపై నియామకం**
**ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణ**
**నల్గొండ జిల్లాకు బదిలీ అయిన జయకర్ స్థానంలో నియామకం**
**గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తానని వెల్లడి**
**ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో సేవలందిస్తానని హామీ**



**బషీరాబాద్, జూన్ 10 (కొత్త స్వరం):**
బషీరాబాద్ గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తాండూరు మండలంలోని సంగెం కాలన్ గ్రామపంచాయతీ నుంచి బదిలీపై వచ్చిన ఆయన బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు బషీరాబాద్ గ్రామపంచాయతీలో విధులు నిర్వహించిన కార్యదర్శి జయకర్ నల్గొండ జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాలకృష్ణను ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజల సహకారంతో సమన్వయంగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

## 'ఎస్ఐఆర్'కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**
**రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్వో చల్లా ఓబులేసు సమావేశం**
**ఈ నెల 15 నుంచి ఇంటింటికీ బీఎల్‌వోల పర్యటన**
**ఓటర్లు అవసరమైన పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచన**
**పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనకు సహకారం అందించాలని విజ్ఞప్తి**



**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**
దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్)ను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. బుధవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. బీఎల్‌వోలు అడిగే పత్రాలు, వివరాలను ప్రజలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బీఎల్‌వోలు మ్యాపింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిని ఓటరు స్వయంగా పూర్తి చేసి బీఎల్‌వోకు అందించాలని తెలిపారు. ఒక ఫారంపై బీఎల్‌వో సంతకం చేసి ఎక్నాలెడ్జ్‌మెంట్‌గా ఓటరుకు తిరిగి అందజేస్తారని వివరించారు. ఓటర్లు తమ ఈపిక్ (ఓటరు గుర్తింపు) కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే 2002 సంవత్సరంలో తాము లేదా కుటుంబ సభ్యులు నమోదై ఉన్న ఓటరు జాబితా వివరాలు, పోలింగ్ కేంద్ర సమాచారం, తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు లేదా నానమ్మల ఈపిక్ కార్డులు అందుబాటులో ఉంటే మ్యాపింగ్ ప్రక్రియ మరింత సులభంగా పూర్తవుతుందని తెలిపారు. వివాహం అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఇటీవల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారు తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను ముందుగానే సేకరించి ఉంచుకోవాలని సూచించారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ప్రతి ఒక్కరూ బీఎల్‌వోలకు సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్వో కోరారు. త్వరలో బీఎల్‌వోలు, బీఎల్ఏలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, మేనేజర్ జునైద్, సూపరింటెండెంట్ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం





**మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి**
**డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**
**కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన డీఎస్పీ నర్సింగ్ యాదయ్య**
**డ్రగ్స్, గంజాయి, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని యువతకు సూచన**
**తల్లిదండ్రుల మాట విని చదువుపై దృష్టి పెట్టాలని పిలుపు**

**తాండూరు, జూన్ 10 (కొత్త స్వరం) :**
మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని, ఆ దిశగా ప్రజలందరూ భాగస్వాములు కావాలని తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య పిలుపునిచ్చారు. గురువారం తాండూరు పట్టణంలోని మార్కండేయ కాలనీలో డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మత్తు మరియు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ నర్సింగ్ యాదయ్య మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు డ్రగ్స్, గంజాయి, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల మాట విని క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడటంలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ పరమేశ్వర్, డవ్ సంస్థ ఇన్‌చార్జి శ్రీనివాస్, మల్లారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ పులుసు మామిడి నరసింహులు, కార్యదర్శి వెంకటేశం, సిస్టర్ భారతి, సిస్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



# బషీరాబాద్ గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం



**ప్రజా పాలన గ్రామసభలో సర్పంచ్ వెంకటేష్ మహారాజ్ హామీ**
**రహదారులు, మురుగు కాలువలు, స్మశానవాటిక అభివృద్ధికి ప్రాధాన్యం**
**మండలానికి పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినట్లు వెల్లడి**
**ఎమ్మెల్యే సహకారంతో అధిక నిధులు తీసుకువస్తామని ప్రకటన**
**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని భరోసా**

**బషీరాబాద్, జూన్ 10 (కొత్త స్వరం):**
బషీరాబాద్ గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ వెంకటేష్ మహారాజ్ తెలిపారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో ఆయన పాల్గొని గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మహారాజ్ మాట్లాడుతూ బషీరాబాద్ మండల కేంద్రం నుంచి జీవంగి–కరణ్‌కోట్ వరకు డబుల్ రోడ్డు విస్తరణ, గ్రామంలోని పాత ఇండ్ల సమస్యలు, స్మశానవాటిక అభివృద్ధి, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ మరమ్మతులు తదితర అంశాలపై గ్రామసభలో చర్చించినట్లు తెలిపారు. బషీరాబాద్ మండలానికి పబ్లిక్ స్కూల్ మంజూరు అయిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో బషీరాబాద్ గ్రామపంచాయతీకి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ వెంకటేష్ మహారాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంపత్ కుమార్, గ్రామ కార్యదర్శి బాలకృష్ణ, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఉపసర్పంచ్ రజాక్, వికారాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, వార్డు సభ్యులు శ్రీకాంత్, రాము, రాఘవేందర్, గ్రామ పెద్దలు పవన్ ఠాకూర్, సాయిలు గౌడ్, సిద్ధు, నర్సింలు, రవి, రాములు, హెడ్ కానిస్టేబుల్ లోక్య నాయక్, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, గ్రామ యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారతీరాజా మృతికి చంద్రబాబు సంతాపం

**అమరావతి, జూన్ 10 (కొత్తస్వరం)**
భారతీరాజా మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. భారతీరాజా మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సోషల్ విOడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'భారతీరాజా మరణం బాధాకరం. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు ఆయన చిరస్మరణీయ చిత్రాలు అందించారు. భారతీయ సినీ రంగానికి ఆయన మరణం తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



## పందుల రాబరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

**రూ.3 లక్షల విలువైన 30 పందులు, బొలెరో వాహనం స్వాధీనం**
**యజమానులపై దాడి చేసి పందులు ఎత్తుకెళ్లిన ముఠా**
**మునగాలపాడు శివారులో ఇద్దరు నిందితుల పట్టివేత**
**దొంగతనాలకు వేర్వేరు నంబర్ ప్లేట్లు వినియోగించినట్లు వెల్లడి**
**మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు కొనసాగింపు**



**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**
కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో 30 పందులను దొంగిలించి, అడ్డుకున్న యజమానులపై దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన 30 పందులు, బొలెరో సిటీ పికప్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, గత మే 28న వీకర్ సెక్షన్ కాలనీలో పందులను దొంగిలించి తీసుకెళ్తుండగా అడ్డుకున్న యజమానులపై దాడి చేసిన ఘటనపై రాబరీ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీఐ విక్రమసింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, కానిస్టేబుళ్లు మురళి, గోవిందు, శ్రీనివాసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితులను గుర్తించి పట్టుకున్నారు. దర్యాప్తులో బెంగళూరుకు చెందిన పరశురాం, శ్రీను, భాగల్‌కోట్ జిల్లాకు చెందిన లక్ష్మణ్, ఎల్లప్ప, సింధనూరుకు చెందిన మారుతి ఈ నేరంలో పాల్గొన్నట్లు గుర్తించారు. వీరిలో పరశురాంతో పాటు ఒక మైనర్ బాలుడిని మునగాలపాడు శివారులో మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. నిందితులు గుర్తింపు తప్పించుకునేందుకు వాహనాలకు వేర్వేరు నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి కేఏ–15–ఏ–7773 నంబర్ గల బొలెరో సిటీ పికప్ వాహనం, 30 పందులు, అలాగే దొంగతనాల సమయంలో అడ్డొచ్చే వారిపై దాడి చేసేందుకు వినియోగించే కూల్‌డ్రింక్ సీసాలు, రాళ్లు ఉంచిన క్రేట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన పరశురాం, మైనర్ బాలుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, తదుపరి చర్యల నిమిత్తం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారు ధోన్, ప్యాపిలి, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో గత నెలలో జరిగిన పందుల దొంగతనాల్లో కూడా పాల్గొన్నట్లు గుర్తించామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

**రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం**
**గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల**
**సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం**
**రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ**

**ఆదిలాబాద్, జూన్ 10 (కొత్తస్వరం) :**
తెలంగాణలో పోలీసింగ్ విధానంలో కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియామాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రై మ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు.

# కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
## కర్నూలు - నంద్యాల
గురువారం, జూన్ 11, 2026 పేజీ 6


# స్థిరాస్తి వ్యాపారి అరుణ్ కుమార్ దురాగతం

### భార్యపై అనుమానంతో కాల్పులు

### అక్కడిక్కడే మృతి చెందిన ఇల్లాలు

**హైదరాబాద్, జూన్ 10 (కొత్తస్వరం) :**

ఓ స్థిరాస్తి వ్యాపారి అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తితో కలిసి తెల్లవారుజామున ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషారాణిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. 3 నెలల క్రితం అంబర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరుణ్‌కుమార్ తుపాకీతో పోలీసులకు చిక్కాడు. తుపాకీ సీజ్ చేయడంతో పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసి దారుణానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026పై ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు శిక్షణ





**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమం సమర్థవంతమైన అమలుకు సంబంధించి ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల సవరణ ప్రక్రియ, ఓటరు జాబితా నవీకరణకు సంబంధించిన అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

## పట్టణాల సమగ్రాభివృద్ధికి 30 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

**ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రతి మున్సిపాలిటీలో నోడల్ అధికారుల నియామకం**

**ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచన**

**మున్సిపల్ భూములు ప్రజా ఆస్తులేనని స్పష్టం**

**మౌలిక వసతుల కల్పనపై సీఎం చంద్రబాబు ప్రశంసలు**

**అర్బన్ ఛాలెంజ్ ఫండ్ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్**

**విజయవాడ, జూన్ 10 (కొత్త స్వరం):**

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీలు) సమగ్రాభివృద్ధి సాధించాలంటే 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను నిర్దేశిత కాలపరిమితిలో అమలు చేయడం అత్యంత అవసరమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ అన్నారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టణ సంస్కరణల కోసం అధికారులు చూపిన నిబద్ధత అభినందనీయమన్నారు. ప్రతి మున్సిపాలిటీ కనీసం ఒక ఆదాయాన్ని అందించే ప్రాజెక్టును, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, తిరుపతి వంటి పెద్ద కార్పొరేషన్లు ఒకటి కంటే ఎక్కువ ప్రాజెక్టులను ప్రతిపాదించాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు, ఆర్థిక అంచనాలు, స్పష్టమైన ఆదాయ వనరులు, నిర్వహణ ప్రణాళికలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మున్సిపాల్టీల్లో మౌలిక వసతుల కల్పనను ముఖ్యమంత్రి ఎన్ . చంద్రబాబు నాయుడు ప్రశంసించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తూ మున్సిపాలిటీల పనితీరుపై నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారని తెలిపారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, ఆంధ్రప్రదేశ్ అర్బన్ మరియు ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తో ప్రతిరోజూ సమన్వయం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ భూములు, ఆస్తులు ప్రజా ఆస్తులేనని, వాటిని విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వాటిని వాణిజ్య సముదాయాలు, మార్కెట్లు, పెట్ పార్కులు, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేసి ఆదాయ వనరులుగా మార్చాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రజలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని, సోషల్ మీడియా వేదికల ద్వారా పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైప్‌లైన్ పనులు జరిగే ప్రాంతాల్లో సైనేజ్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ఆదేశించారు. సీడీఎంఏ వెబ్‌సైట్‌లో త్వరలో 'హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ మాడ్యూల్' ప్రవేశపెడుతున్నామని, దీని ద్వారా మున్సిపల్ కమిషనర్ల శిక్షణ, పనితీరును పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల సంపూర్ణ సంతృప్తి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డా. పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ విలువైన మున్సిపల్ ప్రాంతాల్లో పీపీపీ విధానానికి, ఇతర ప్రాంతాల్లో యూసీఎఫ్ నిధులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే 36 యూఎల్‌బీలలో 21 యూఎల్‌బీలతో సమావేశాలు పూర్తయ్యాయని, 16 యూఎల్‌బీలు డీపీఆర్ తయారీలో పురోగతి సాధించాయని తెలిపారు. హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) డా. వివేక్ మాట్లాడుతూ ప్రాజెక్టు నివేదికల్లో వాస్తవ ఆర్థిక వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. సరైన ఆర్థిక నిర్మాణంతో డీపీఆర్‌లు సిద్ధమైతే రుణాలు, మున్సిపల్ బాండ్ల సమీకరణ ప్రక్రియ వేగవంతమవుతుందని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో హడ్కో, వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు పీపీపీ ప్రాజెక్టుల అమలు విధానాలపై యూఎల్‌బీ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేతన్ గార్గ్, అనిల్ కుమార్ రెడ్డి, ఎం. ప్రభాకర్ రావు, ఏ. సుధాకర్ రావు, కార్తీక్, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు, ఫైనాన్స్ అధికారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి సమస్యకు రిజర్వాయర్ల నిర్మాణమే శాశ్వత పరిష్కారం





















### విద్యుత్ ప్రమాదాల్లో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలి

### జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

### తాగునీరు, సాగునీటి సమస్యలపై సమగ్ర చర్చ

### కౌలు రైతులకు హక్కు పత్రాలు, బ్యాంకు రుణాలపై దృష్టి

### గ్రామీణ విద్య, మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు

**కర్నూలు, జూన్ 10 (కొత్త స్వరం):**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో తాగునీటి సమస్యకు రిజర్వాయర్ల నిర్మాణమే శాశ్వత పరిష్కారమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పాఠశాల విద్య తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొన్నదని, వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశముందని తెలిపారు. తుంగభద్ర, పెన్నా నదుల ద్వారా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ నిల్వ సదుపాయాల కొరత వల్ల తాగునీరు, సాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి సంబంధించి ప్రజా ప్రతినిధుల సూచనలు స్వీకరించి తదుపరి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ఫ్లోరైడ్ సమస్య, భూగర్భ జలాల కొరతను దృష్టిలో ఉంచుకుని కర్నూలు జిల్లాలోని ఆరు మండలాలు, నంద్యాల జిల్లాలోని రెండు మండలాల్లో మదర్ ప్లాంట్లు, గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి–167 నిర్మాణ పనుల కారణంగా తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినే అవకాశమున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తరువాతే వాటిని తొలగించాలని సూచించారు. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యుత్ లైన్లను నిర్దేశిత ప్రమాణాల మేరకు ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి. పార్థసారథి మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, కౌలు రైతులకు హక్కు పత్రాల జారీ ద్వారా బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో 25 వేల మంది కౌలు రైతులకు హక్కు పత్రాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి మాట్లాడుతూ ప్రీ–మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమం గత ఏడాదితో పోలిస్తే విజయవంతంగా సాగుతోందని తెలిపారు. 87 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటికే 65 వేల ఎకరాల్లో విత్తనాలు పూర్తయ్యాయని వెల్లడించారు. గ్రామీణ నీటి సరఫరా పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ రైతులకు ఎరువుల పంపిణీ, ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. సహజ వ్యవసాయానికి సంబంధించిన పీఎండీఎస్ కిట్ల పంపిణీపై వివరాలు తెలుసుకొని రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి మాట్లాడుతూ ఆలూరులోని అగ్రి ల్యాబ్‌ను తరలించకుండా అక్కడే కొనసాగించాలని కోరారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం, జొన్నలు కొనుగోలు కాక గోదాముల్లో నిల్వ ఉండిపోతున్నాయని, వెంటనే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఆలూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్ మాట్లాడుతూ డీసీఎంఎస్ ద్వారా రైతుల నుంచి జొన్నలు, కందులు, శనగలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు డీసీఎంఎస్ క్రెడిట్ పరిమితిని పెంచాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొని వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

## తనదైన ముద్ర వేసిన దర్శకుడు భారతీరాజా

**ఎక్స్ వేదికగా నివాళి అర్పించిన పవన్ కళ్యాణ్**

**అమరావతి, జూన్ 10 (కొత్తస్వరం)**

ప్రముఖ దర్శకులు భారతీరాజా మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. భారతీరాజా మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పవన్ తెలిపారు. 'ప్రముఖ దర్శకులు భారతీరాజా కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారు. గ్రామీణ నేపథ్యం, పల్లె ప్రజల జీవనం, ప్రేమానుబంధాలను, టీనేజర్స్‌కు ఉండే ఆకర్షణలు లాంటివి చూపించడంలో ఆయన శైలి ప్రత్యేకమైనది. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుంది. ఆ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పించాయి. అన్నయ్య చిరంజీవితో 'ఆరాధన' చిత్రం రూపొందించారు. అందులో 'అరె ఏమైంది...' అనే పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. సున్నితమైన ప్రేమ, సెంటిమెంట్ కథలే కాకుండా 'ఎర్ర గులాబీలు', 'టిక్ టిక్ టిక' లాంటి థ్రిల్లర్స్‌తోను ప్రేక్షకులను మెప్పించారు. అలాంటి గొప్ప సృజనాత్మక దర్శకుడిని కోల్పోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు. భారతీరాజా మరణం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.